క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల సత్తా

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు. మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న సిద్ధు, శివ జనవరి 2024లో దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి.. మే 2024లో నిర్వహించబోయే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలోమహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదవడం ద్వారానే అనుకున్న లక్ష్యాలను ఛేదించవచ్చని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్ డ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రముఖ ఐఐటీ సీట్లు సాధించి కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్లుగా స్థిరపడటమే తమ లక్ష్యమని ఎంపికైన విద్యార్థులు తెలిపారు. విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పుస్తకాల వితరణ



జిల్లా గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దేవేంద్రరావు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి శుక్రవారం వెటర్నరీ యూనివర్శిటీ రిటైర్డ్ అడ్మిస్ట్రేషన్ అధికారి డాక్టర్ దేవేంద్రరావు పుస్తకాలను వితరణ చేశారు. జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను లైబ్రరీకి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనుల అడ్డగింత

కందుకూరు: డ్రైనేజీ నిర్మాణం చేపట్టకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిధిలో బాబు జగ్జీవన్‌రావు విగ్రహం నుంచి సీపీఎస్ పాఠశాల వరకు ఆర్‌అండ్‌బీ రహదారి (సీసీ) నిర్మాణం చేపట్టడానికి శుక్రవారం అధికారులు పనులు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు యాదగిరి, సురేశ్, కిషన్, మంద రవి, నాగేశ్ తదితరులు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మించకుండా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వర్షాకాలంలో వర్షం నీటితో పాటు మురుగు నీరు తమ ఇళ్లను ముంచెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మించిన తర్వాత డ్రైనేజీ నిర్మిస్తే ఆ రోడ్డు పాడై, ప్రజాధనం వృథా అవుతుందని వాపోయారు. మరోసారి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అప్పటి వరకు రోడ్డు పనులు ఆపాలని కోరారు.


తల్లీకూతురు అదృశ్యం

మీర్‌పేట్ పీఎస్‌లో ఫిర్యాదు

బడంగ్‌పేట్: తల్లి, కూతురు అదృశ్యమైన ఘటన శుక్రవారం మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివనారాయణపురం కాలనీలో నివాసం ఉంటున్న భోగి తేజ (38), కుమార్తె సాయిపల్లవిని నెల 12 తీసుకెళ్లిందని, అప్పటి నుంచి ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణి



పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా వాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన వసంత బదిలీపై ఆమనగల్లుకు వెళ్లారు. ఆమె స్థానంలో మీర్‌పేట్ కమిషనర్‌గా ఉన్న వాణి బాధ్యతలు చేపట్టారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. పాలక మండలి సభ్యులందరినీ కలుపుకొని మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం పనిచేస్తామని తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడిగా అశ్విని, డీఈఓగా రోజా, కలెక్టర్‌గా జాహ్నవి, మరికొందరు ఉపాధ్యాయులుగా బాధ్యతలునిర్వహించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆఖిరి మజిలీకి అవస్థలెన్నో!

ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారాలు చేయాలంటే బంధువులకు ఇబ్బందులు తప్పడం లేదు. మీర్‌పేటలోని జిల్లెలగూడ సాయినగర్ శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. మొదట్లో కాంట్రాక్టర్ కొంతమేరకు పనులు చేసి మధ్యలోనే వదిలేశాడు. రెండేళ్లు గడుస్తున్నా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. అంత్యక్రియల తర్వాత స్నానం చేసేందుకు గదులు కూడా లేవు. దీంతో మహిళలు పరదాల చాటున స్నానాలు చేస్తున్నారు.



జిల్లెలగూడ సాయినగర్ శ్మశానవాటిక

శంకుస్థాపన చేసి రెండేళ్లవుతున్నా..

ముందుకు సాగని పనులు

- అభివృద్ధికి నోచుకోని సాయినగర్ శ్మశాన వాటిక
- స్నానాల గదులు లేక... పరదాలు ఏర్పాటు చేసిన వైనం

మీర్‌పేట: శంకుస్థాపన చేసి రెండేళ్లు పూర్తవుతున్నా ఒక్క అడుగు ముందుకు పడలేదు. నిధులు మంజూరైనా అభివృద్ధికి నోచుకోని వైనం. వివరాల్లోకి వెళితే... మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ సాయినగర్ శ్మశాన వాటికను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1 కోటి నిధులను మంజూరు చేశారు. 2021 డిసెంబరు 22వ శంకుస్థాపన కూడా జరిగింది. ఇదిగో.. అదిగో పనులు మొదలుపెడతామంటూ అధికారులు రెండేళ్లుగా చెబుతున్నా పనులు మాత్రం జరగడం లేదని స్థానికులు చెబుతున్నారు. కనీస వసతులు లేకపోవడంతో అంత్యక్రియలు చేసేందుకు శ్మశాన వాటికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని పరిసర కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గదుల కోసం పిల్లర్ల వరకు నిర్మించి మధ్యలోనే వదిలేశారని, ఇంతవరకు ఒక్క పని కూడా జరగలేదని స్థానికులు చెప్పారు. సాయినగర్‌తో పాటు సిర్లాహిల్స్ శ్మశాన వాటికలకు కోటి రూపాయల నిధులను మంజూరు చేశారని, ఆలస్యంగానైనా సిర్లాహిల్స్‌లో పనులు కొనసాగుతున్నాయని, ఇక్కడ కూడా పనులు ప్రారంభించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

స్నానాల గదుల్లేక ఇబ్బందులు

సాయినగర్ శ్మశాన వాటికలో పరదాలే స్నానాల గదులుగా మారిన దుస్థితి. అంత్యక్రియలకు వచ్చే వారికి స్నానాల గదులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. పిల్లర్లకు నాలుగు వైపులా పరదాలు కట్టి స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి తెచ్చి అభివృద్ధి పనులు మొదలుపెట్టేలా చొరవ తీసుకోవాలని, అప్పటివరకు తాత్కాలికంగానైనా స్నానాల గదులు నిర్మించాలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్

సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు రఘురామ్



సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రఘురామ్

మహేశ్వరం: సేవాలాల్ మహారాజ్ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు రఘురామ్ రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బంజారుల ఆరాధ్య దైవమని అన్నారు. సేవాలాల్ తన బోధనలు, రచనల ద్వారా ప్రజలను జాగృతం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దేవేందర్ నాయక్, రఘు, రాజేశ్, స్వామి, వంశీ పాల్గొన్నారు.

చెరువులకు పూర్వ వైభవం తెస్తా

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



మీర్‌పేట్‌లోని పెద్ద చెరువును సందర్శించిన కేఎల్లార్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లోని చెరువులకు పూర్వ వైభవం తెస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ రెండు కార్పొరేషన్ల పరిధిలోని చెరువులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతలు చెరువులను కబ్జాలు చేశారని ఆరోపించారు. చెరువులు నిండుకుండలా ఉంటేనే భూగర్భ జలాలు ఉత్పత్తి అవుతాయని తెలిపారు. చెరువులు ధ్వంసం అయితే భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. త్వరలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కార్పొరేషన్ల పరిధిలోని చెరువులను సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ఆధ్వర్యంలో చేరిక

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్లు అరుణ, ప్రమీలకు కేఎల్లార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డివిజన్ల అభివృద్ధితో పాటు కేఎల్లార్ నాయకత్వంపై నమ్మకం ఏర్పడి కాంగ్రెస్‌లో చేరామని కార్పొరేటర్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వారికి గుర్తింపు ఇస్తామని కేఎల్లార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

- కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం
- రైతులను పట్టించుకోని ప్రధాని
- మోదీపై కార్మిక సంఘాల ధ్వజం

మహేశ్వరం: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిక విధానాలు అమలు చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కులో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం పని చేస్తోందని ఆరోపించారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పరమేశ్, వెంకటేశ్, కుమార్, శంకర్, శ్రీశైలం, రాజు, చెన్నయ్య, రవి, అరుణ్, సాయి, యాదయ్య, సాయి కుమార్ పలువురు పాల్గొన్నారు.

బీజేపీని చిత్తుగా ఓడించాలి

బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కవిత పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలతో రైతులు, కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్, మండల నాయకులు జగన్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్ కోరారు. శుక్రవారం మంఖాల్ పారిశ్రామిక వాడ, తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కులో కార్మికులతో కలిసి దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బ్రహ్మచారి, యాదగిరి, రాజు, నర్సింహ, అశోక్, వెంకటేశ్ పాల్గొన్నారు.



మంఖాల్ పారిశ్రామికవాడలో ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం

కందుకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ..పేదలను విస్మరిస్తుందని, రైతులను పట్టించుకోవడం లేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దుకాణాలు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి శ్రీశైలం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో కార్మికులు, కర్షకులు నష్టపోతున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తు ప్రభుత్వం పేదల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. గత ఏడాది 11 నెలల పాటు దేశ రాజధానిని చుట్టుముట్టి రైతులు ఉద్యమించినా, ఎంతో మంది రైతులు ప్రాణాలు అర్పించినా ప్రభుత్వంలో చలనమేలేదన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో మళ్లీ రైతులు ఉద్యమబాట పట్టారని తెలిపారు. వారి ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. కార్మిక, కర్షక, పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమార్, సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, కేవీపీఎస్ మండల కార్యదర్శి చందు, సీఐటీయూ నాయకులు సాయిలు, శ్రీనివాస్, యాదయ్య, శేఖర్, సత్తయ్య, కుమార్, శ్రీనివాస్, బాల్‌రాజ్‌గౌడ్, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

తుక్కుగూడ: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంఖాల్ పారిశ్రామిక వాడలో చేపట్టిన బంద్ ప్రశాతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు రవి, నాయకులు పరమేశ్, వెంకటేష్, శంకర్, రాజు, చెన్నయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం అన్యాయం చేస్తోంది

బడంగ్‌పేట్: కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారం బాలాపూర్ చౌరస్తాలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను, చట్టాలను కుదించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



మహేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



కందుకూరు చౌరస్తాలో..



బాలాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు

వార్డు అభివృద్ధికి కృషి

బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్



రావిర్యాలలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కమిషనర్, కౌన్సిలర్

తుక్కుగూడ: వార్డు అభివృద్ధి కృషి చేస్తానని మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ ప్రకటించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో సీసీ రోడ్డు పనులను ఆయన మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతు వార్డులో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ భార్గవ్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



ఆలయంలో కొలువైన సూర్యభగవానుడు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ శ్రీఛత్రగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం వైభవంగా రథసప్తమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య భగవాన్, లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు రథసప్తమి వేడక విశిష్టితను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు అజయ్‌శర్మ, మురళిశర్మ, భక్తులు పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డికి పరామర్శ



దయాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: అనారోగ్యంతో బాధ పడుతున్న సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ భర్త, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దయాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే సబితారెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సేవే లక్ష్యంగా పని చేస్తున్న వారికి భగవంతుడికి ఆశీస్సులు ఉంటాయన్నారు. ప్రజా సేవలో ఉన్న వారు ఆరోగ్యం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు అంకిరెడ్డి, ఫ్రూట్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంనర్సింహాగౌడ్, యువజన నాయకులు కొండల్‌రెడ్డి, రిషి తదితరులున్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన అవసరం

గౌతమి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్



విద్యార్థులకు సానిటరీ ప్యాడ్స్ అందజేసిన నిర్వాహకులు

కడ్తాల్: గౌతమి ఫౌండేషన్, ది గర్ల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు మండల పరిధిలోని గానుగుమార్లతండాలో బాలికలకు, మహిళలకు సానిటరీ ప్యాడ్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గౌతమి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ మాట్లాడుతూ.. నేటి ఆహారపు అలవాట్లు, జీవనశైలి తదితర కారణాల రీత్యా చిన్న వయసులోనే బాలికలు రుతుక్రమ సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. బాలికలు వారి సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థంకాని అయోమయ స్థితిలో ఉన్నారని, అలాంటి వారికి సలహాలు, సూచనలు అందించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. అందులో భాగంగానే బాలికలకు గౌతమి ఫౌండేషన్, గర్ల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ది గర్ల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రోహిణి నాయుడు విద్యార్థులక శానిటరి ప్యాడ్స్ వినియోగంపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ధనుంజయ్

తుక్కుగూడ: రాష్ట్రంలో వెనుకబడిన కులాలను గుర్తించడానికి కులగణన తీర్మానాన్ని శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టడం హర్షణీయమని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ధనుంజయ్ కొనియాడారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు బీసీలకు రాజకీయపరంగా అన్యాయం చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో కులగణన ద్వారా రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు.

నేడు సైన్స్ ఎక్స్‌పో

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం వెంకటరమణ కాలనీలోని రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పో–2024 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు సూర్యనారాయణ, సందీప్ తెలిపారు. ఎక్స్‌పో లో విద్యార్థులు ఆయా సబ్జెక్టుల వారీగా రూపొందించిన నమూనాలను ప్రదర్శిస్తారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైన్స్ ఎక్స్‌పోను తిలకించాలని కోరారు.

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న భూ బాధితులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రఘును శుక్రవారం బడంగ్‌పేటకు చెందిన దళిత భూ బాధితులు సన్మానించారు. దావుత్‌ఖాన్‌గూడలోని సర్వే నంబర్‌లో మిగిలిన భూమిని ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న చిత్రం కుటుంబ సభ్యులకు చెందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమేశ్, సురేశ్, అండాలు, అంజమ్మ, భిక్షపమ్మ, లక్ష్మమ్మ, చిట్టి, రాములు, సత్తయ్య, యాదయ్య, శంకరయ్య తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

యాచారం: ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తామని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను శుక్రవారం ఎంపీడీఓ నరేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప, యాచారం విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ పాషతో కలిసి ఆమె సందర్శించారు. 20 ఏళ్ల పాటు వృథాగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ మహాలక్ష్మీ పథకం పుణ్యాన వాడకంలోకి వచ్చింది. అయితే బస్టాండ్‌లో అనేక సమస్యలు ఉన్నాయి. విద్యుత్ లైట్లు, శుభ్రత లేకపోవడం, మరుగుదొడ్లు, మూత్రశాలలు వాడుకలో లేకపోవడం, తాగునీటి వసతి, సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ అన్నిశాఖల అధికారులను పిలిపించి బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. త్వరలో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తామని, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తామని అధికారులు ఎంపీపీకి తెలిపారు. నీటి సరఫరాతో వాడకలో లేని మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేయించి ప్రయాణికుల సమస్యలు తీరుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ కోసం కావాల్సిన నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలియజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ... ఆర్టీసీ బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి బస్సు బస్టాండ్‌లోకి వచ్చిపోయేలా కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్ప తెలిపారు.